# నాకు పాప వద్దు!

— లక్ష్మీ సుబ్బారావు

అనసూయ, శకుంతల స్వంత అక్కచెల్లెళ్లు కాకపోయినా, ఇరుగూ పొరుగూ కాకపోయినా అంతకంటే ఆత్మీయులుగా మెలిగేవారు. ఒకే వీథిలో ఉంటున్న వారిద్దరికి మాత్రం అంత సఖ్యత ఏర్పడిందంటే దానికి కారణమూ ఉంది. అదేమంటే, ఇద్దరికీ ఒకే మారు పెళ్లిళ్లయి, కాపురానికి వచ్చి దాదాపు పది పన్నెండేళ్లు కావస్తున్నా సంతానం కలగకపోవటం. మరో విచిత్రం. ఆ వీథిలోకల్లా వీరిద్దరే సంతాన విహీనులవటం. ఇతరుల విమర్శకు అలవాటు పడిపోయిన ఇద్దరికీ ఒకరి కొకరి తోడు చాలా ఊరట కలిగించేది. ఏదైనా సినిమాకు వెళ్లాలన్నా, పేరంటానికి వెళ్లాలంటేమా ఇద్దరూ చేరిపోవలసిందే. షాపులో ఏ రకమైన కొత్త చీరలు వచ్చినా ఇద్దరూ ఒకే రకమైన చీర కొనేవారు. వీరి ఈ గాఢ స్నేహం ఆ వీథిలో ఉన్న అమ్మలక్కలకి కాస్త కంట గింపూ కలిగించేది. "ఆ. . . వాళ్లకేం పిల్లా, జెల్లా! టింగురంగా అంటూ తయారవుతారు ఎక్కడికీ. . . అయినా. ఏముండీ ఏం ప్రయోజనం? పిల్లలు లేని ఇంట్లో బిచ్చగాడు సైతం భిక్షం తీసుకోడు. . ." అలా తమ అక్కసు తీర్చుకొనేవారు తృప్తిగా, పిల్లలను కన్నంత మాత్రాన తాము మహా పుణ్యాత్ములై పోయినట్లు.

అయితే వాస్తవానికి అనసూయ, శకుంతల ఇరువురికీ తమకు పిల్లలు కలగలేదనే చింత లోలోపలే క్రుంగ చేసేది. ఇంక కలగబోదనే నిరాశకూడా ఆవరించింది వాళ్లని. భగవంతుడు తమకు ఆ లోటు ఇక తీర్చడేమో అన్న నిస్పృహ ఒక్కోసారి వారిని తీవ్రంగా వేధించేది కూడా. తమ మనసులోని వేదన మరవ టానికే తరుచూ ఇద్దరూ ఏవో ప్రోగ్రాములు వేసుకొనేవారు. అలా కాలం సరదాగా గడుపుతూ తమలోని కలతను మరిచినట్లు కనబడేవారు.

అయితే కాలం ఎప్పుడూ ఒకే రీతిగా ఉంటే ఈ లోకంలో ఇన్ని సంఘటనలూ, విచిత్రాలూ ఎలా జరుగుతాయి.? శకుంతల, అనసూయల విషయంలో విధి కాస్త ఆటలాడి తమాషా చూపిం దేమో అనవచ్చు.

ఒకసారి అనసూయ తన పుట్టింటి వైపు బంధువుల ఇంట్లో ఏదో పెళ్లికి వెళ్లింది. వెళ్లిన మనిషి పుట్టింట్లో ఒక నెల రోజులు సరదాగా గడిపి ఇంటికి మరలి వచ్చింది. ఇల్లంతా నానా హంగామాగా ఉంది. ఒక కొలిక్కి తీసు కొచ్చేసరికి కనుచీకటివేళ అయిపోయింది. పని చేస్తున్నంతసేపూ మనసంతా శకుంతల మీదే ఉంది. తను వచ్చిన సంగతి తెలిసికూడా ఇంకా ఒక్కసారైనా రాలేదేమా అని మథనపడుతూంది మనసు. పోనీ, తను వెళదామా అంటే క్షణం తీరిక దొరకలేదు తనకు.

ఆ రాత్రి వంటింటి పనంతా ముగించుకొని తమలపాకుల పళ్లెం చేత బట్టుకొని పడక గదిలో అడుగు పెట్టింది తీరికగా అనసూయ. భర్త కేశవరావు ఏదో పుస్తకం చదువుతున్నవాడల్లా టక్కున పుస్తకం మూసేసి అలా అనసూయ వంక నిదానంగా చూశాడు. ఇప్పుడు తను చెప్పబోయే వార్త అనసూయలో ఏ విధమైన మార్పు తేబోతుందో అన్న కుతూహలం కలిగింది అతనికి.

భర్త అలా తన వంకే చూడటం అనసూయకు ఏదోలా అనిపించింది.


"ఏమిటీ, నన్నేదో వింతగా చూస్తున్నారు— ఇప్పుడే కొత్తగా చూస్తున్న వారిలా?" తమలపాకులు అందిస్తూ అడిగింది చిరునవ్వుతో.

"ఆహా. . . ఏం లేదులే. ఏమిటీ, పెళ్లికని వెళ్లి ఈ సారి చాలా రోజులే మకాం వేశావు? అన్నట్లు నీ కీ సంగతి తెలుసా?"

"ఏ సంగతి?" కుతూహలం ధ్వనించింది అనసూయ స్వరంలో.

"అయితే, నీ స్నేహితురాలి సంగతి నీదాకా ఇంకా రాలేదన్న మాట!"

శకుంతల సంగతి అనగానే ఒక్కసారి గతుక్కుమంది. ఏమిటీ, తనకిగానీ ఆరోగ్యం ఏమీ చెడలేదు కదా? అందుకే నేమో తను వచ్చిన సంగతి తెలిసీ రాలేక పోయింది. ఇక సస్పెన్సు భరించలేక పోయింది.




"మరీ చంపక అసలు విషయమేమో చెప్పుదురూ!" అసహనంగా అడిగింది.

కేశవరావు తాపీగా విషయం వివరించాడు ఇలా:

"మొన్న ఆనందరావు కనపడ్డాడు, రిక్షాలో భార్యతో సహా వెళుతూ. ఆవిడ మరీ నీరసంగా కనపడుతుంటేనూ అడిగాను—ఒంట్లో బాగా లేదా అని. 'ఒంట్లో బాగుకేం లేదు గానీ కాస్త నీరసం. అంతే. అంటే షి ఈజ్ ఇన్ ది ఫేమిలీ వే' అన్నాడు నవ్వుతూ. అంటే, ఆనందరావు తండ్రి కాబోతున్నాడన్న మాట!"

భర్త మాటలు మొదట అర్థం కాలేదు. అసలు విషయం అర్థం కావటానికి కాస్సేపు పట్టింది అనసూయకు. ఆనందరావు—అంటే శకుంతల భర్త—చెప్పిన విషయం ప్రకారం శకుంతలకి నెల తప్పిందన్న మాట. అంటే, శకుంతల గర్భవతి అన్న మాట. రెండు మూడు సార్లు ఆ మాటే అనుకొంది పదేపదే మనసులో. తన ప్రియస్నేహితురాలు ఇన్నాళ్లకు తల్లి కాబోతూందన్న మాట. ఏదో తెలియని సంతోషం. అంతలోనే ఏదో వెలితిలాంటి భావన. అంటే, తనలో అసూయలాంటి భావమేదో నెమ్మదిగా బయలుదేరిందా? తనకే అనుమానంగా తోచింది. ఊహు. . . శకుంతల పట్ల తనకు అసూయా! ఇలా అనుకోవటం తనకే వింతగా, కొత్తగా తోచింది. ఎంతగా ఆ భావాన్ని అణగదొక్కాలన్నా తన మనసు తన ఆధీనంలో లేకుండానే ఆ భావానికి లొంగి పోతూంది. ఏమిటో తనకూ, శకుంతలకూ మధ్య ఏదో పెద్ద అగాధం ఏర్పడిపోయినట్లుగా భావన. ఇక తమా, శకుంతలా మునుపటి లాగా ఉండగలుగుతారా. . . ఎందుకు ఉండలేరు?. . . ఇప్పుడు మాత్రం ఏమైంది?. . . ఊహు. . . ఏదో అయిపోయింది! తన కేదో అన్యాయం జరిగిపోయినట్లుగా, తను ఒంటరిదై పోయినట్లుగా . . . మునుపటిలాగా తను

స్వేచ్ఛగా శకుంతలతో తిరగగలుగుతుందా. . . ఏమో? దీర్ఘంగా నిట్టూర్చింది అనసూయ! కేశవరావు భార్య ముఖంలోని మార్పులు గమనించి కాస్త కలవర పడ్డాడు. భార్యను మళ్లీ యథాస్థితికి తేవడానికి మాట మారుస్తూ ఇలా అన్నాడు:

“అనూ. . . మరి మీ పుట్టింటి కబుర్లు ఏమీ చెప్పలేదే?”

“కబుర్లకేంలెండి. అంతా మామూలే.” గదిలో అడుగు పెట్టినప్పుడున్న ఉత్సాహం లేదు అనసూయలో. భార్యను ప్రసన్నురాలిని చేసుకోవడానికి కాస్త శ్రమ పడ్డాడు కేశవరావు.

• • •


శకుంతలకు మరీ నీరసంగా ఉండటం వలన అనసూయను చూడ్డానికి వీలు పడలేదు. పోనీ, తను రారాదా— ఊరి నుండి వచ్చి మూడు రోజులైందిగా? ఏమిటో, తనను చూడకుండా ఇన్ని రోజులు ఉండటం తన కేమో ఏదో దిగులుగా ఉంది. మరి అనసూయ ఈ వార్త విన్న వెంటనే పరుగెత్తుకు వస్తుందనుకుంది. మరి ఈ తాటస్థ్యానికి కారణం? పాపం. . . నెల రోజులు ఆడది లేని ఇల్లు సర్దుకోవడానికి ఎలాగూ రెండు రోజులైనా పడుతుంది. సరే. . . తనే రేపు ఎలాగైనా కాస్త సమాళించుకొని వెళ్లి అనసూయను చూడాలి. ఏమిటో తన ఈ పరిస్థితి ఎదురుచూడనిది. పెళ్లయి ఇన్ని సంవత్సరాలకు తను తల్లి కాబోతూంది. సంతోషం ఒక పక్క. . . ఏమిటో ఒక పక్క దిగులు. ప్రసవం స్త్రీకి మరో జన్మ ఎత్తడంలాటిదంటారు. తన ఆరోగ్యం గురించి చాలా జాగ్రత్తలు వేరే చెప్పింది లేడీ డాక్టరు. దిగులు, సంతోషం పెనవేసుకొన్న భవిష్యత్తును గురించి ఆలోచిస్తూంటే తన పరిస్థితి తనకే విచిత్రంగా అనిపించింది. అనసూయ పోకడ వేరే తన కర్థం కాకుండా ఉంది. ఏమైనాసరే, రేపు వెళ్లాలని నిశ్చయించుకుంది శకుంతల.

• • •

గేటు దాటి లోపలికి వస్తున్న శకుంతలను చూస్తూనే కాస్త కలవర పడింది అనసూయ. ఏదో అపరాధం చేసిన దానిలా అనిపించింది తనకు.

“రా, శకుంతలా.” ఎదురువచ్చి ఆహ్వానించింది అనసూయ.

లోపలికొచ్చి కూర్చున్న శకుంతలతో తనేమీ అడక్కుండానే— “ఏమిటో రావాలనుకొంటే కొంచెమైనా తీరుబడి దొరకలేదు, శకుంతలా. మీ అన్నయ్య



ఇల్లు నరకంలా చేసి ఉంచారు. ఎంత సర్దినా శ్రమ చాలటం లేదు మరి" అని సంజాయిషీ ఇచ్చుకొన్నట్లుగా అంది.

అందుకు శకుంతల నీరసంగా నవ్వుతూ, "సరేమో నిన్ను చూడకుండా ఇన్ని రోజు లుండటం నా కెలాగో దిగు లని పించింది. అందుకే వచ్చేశాను" అంటూనే అనసూయ వంక ఆప్యాయత నిండిన చూపులతో పరామర్శించింది.

"ఈ కబుర్ల కేంగానీ, అమ్మదొంగా! అసలు విషయం చెప్పకుండా దాటవేస్తున్నావా? అవునుగానీ నా కెందుకు చెపుతావులే!" మాటలతో ఆప్యాయత లోపించి నిష్ఠురంపాలు ఎక్కువగా ఉంది. శకుంతల మనసు చివుక్కుమంది... ఏమిటో అనసూయ ధోరణి అర్థం కావడం లేదు. అయినా ఎప్పుడూ హాస్యంగా మాట్లాడే అనసూయ మాటలు అంతగా పట్టించుకోలేదు.

"అవును, అనసూయా, నీతో చెప్పకుండానా? అందుకేగా వస్తే, ఈ నీరసంలోనూ. మొన్న అన్నయ్యతోనే చెప్పారటగా మా ఆయన విషయం ఇదని. ఏమిటో నాకో పక్క దిగులుగానూ ఉంది."

'హుఁ... దిగులట, దిగులు... సంగనాచి కబుర్లు కాకపోతే... ఎలాగూ తనూ తల్లి కాబోతూందిగా అనే గర్వం కాబోలే. పైకి ఊరికే నటన...' కసిగా అనుకుంది అనసూయ.

శకుంతలతో ఉత్సాహంగా మాట్లాడ లేకపోతూంది తను. త్వరగా శకుంతల వెళ్ళిపోతే బాగుండునేమో అనిపించింది. ఆమె మనసుకు తగ్గట్లుగానే కేశవరావు ఎప్పటికంటే త్వరగా ఇంటి కొచ్చేశాడు ఆఫీసునుండి.

'అమ్మయ్య!...' ఎంతో రిలీఫ్ ఫీలయింది అనసూయ. శకుంతల కేశవరావును చూసి లేచి వెంచుంది వెళ్ళడాని కుద్యుక్తురాలై.

బొట్టు పెట్టిన అనసూయతో— "వస్తా, అనసూయా" అంటూ నీరసంగా అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయింది శకుంతల. వెళ్ళిపోతున్న శకుంతల కళ్లలో తడి స్పష్టంగా చూశాడు కేశవరావు. ఏదో మనసుకు కష్టం కలిగించేలాగా ప్రవర్తించి ఉంటుంది అనసూయ. తను గమనిస్తున్నాడు— రెండు మూడు రోజులుగా అనసూయ ధోరణి ఏదోలా ఉంది. ఉత్తుత్తినే చిరాకు చెందటం, తనేమైనా అంటే ఇంకా రెచ్చిపోవడం. తను లీలగా ఊహించాడు. శకుంతల గర్భవతి అని విన్నప్పటినుండి ఆమెలోని మాతృ హృదయం తను ఆ స్థానాన్ని అందుకో లేకపోయాననే అన్న తీవ్ర నిరాశకు లోను కావడమే ఈ విపరీతానికి కారణం. తన దుఃఖాన్ని పంచుకోవడానికి ఒక తోడు ఉండేది. ఇప్పుడదీ కరవై తను ఒంటరిదై పోయిందేమోననే దిగులు ఆవరించింది. ప్చ్! ఆమెను చూస్తే తనకూ జాలి వేస్తుంది. అందుకే తను ఒక ప్రోగ్రామ్ వేశాడు. వచ్చే నెలంతా లీవు తీసుకొని అనసూయతో పాటు ఉత్తర హిందూస్థానంలో ఉన్న కొన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి అలాగే ఢిల్లీ, ఆగ్రా అంతా చుట్టి రావాలని ప్లాను వేశాడు. ఇందువల్ల అనసూయ మనసుకు తృప్తి ఉంటుంది. పుణ్యమూ, పురుషార్థమూ రెండూ. ఒక వేళ ఆ పవిత్ర నదీ స్నానాల వల్ల ఏదైనా ఫలితమూ కలగ వచ్చునేమో? తన ఊహకు తనే నవ్వుకున్నాడు కేశవరావు.

• • •

ఇంటికి వచ్చిన శకుంతల మనసు కకావికలై పోయింది. ఎంతో సానుభూతిని, ఆప్యాయతను ఎదురుచూసిన తనకు గొప్ప నిరాశ ఎదురయింది! ఈ అఘాతానికి శకుంతల సున్నితమైన మనసు తట్టుకోలేకపోయింది. అనసూయ ఎందు కిలా మారిపోయింది? ఎంతో అభిమానం చూపే అనసూయలో ఇంత మార్పేమిటి? ఒకవేళ... ఒకవేళ అనసూయ తనను చూసి అసూయ ఫీలవుతూందా?! నమ్మ శక్యంగాలేదు. ఎంత సరిపెట్టుకుందామనుకున్నా అనసూయ ప్రవర్తించిన ఆ తీరు మామూలుగా మాత్రం లేదు. తను తల్లి కాబోతూందన్న వార్త ఆమెలో అసూయను కలిగించిందేమో నిజంగానే? ఒకవేళ తనే అనసూయ స్థానంలో ఉంటే తనూ అలానే ఫీలయ్యేదా... ఏమో, స్త్రీ మనసు ఎవరు చెప్పగలరు? ఏమైనా అనసూయ ప్రవర్తన కాస్త విపరీతంగానే ఉందనిపించింది.

క్రమంగా శకుంతల, అనసూయల మధ్య రాకపోకలు తగ్గుతూ వచ్చాయి. సినిమాకి, షాపింగ్‌కి కలిసి వెళ్ళడం పూర్తిగా తగ్గిపోయిందనే చెప్పాలి. ఎప్పుడైనా ఒకరి కొకరు తటస్థపడినా ముక్తసరి మాటలతో ముగించేవారు. వీళ్ల ఈ వింత మార్పు ఆ వీథిలో వారికి కాస్త ఆశ్చర్యం కలిగించినా, లోలోపలే ఆనందించారుకూడా అనవచ్చు.

కాలగర్భంలో కొన్ని నెలలు దొర్లిపోయాయి. అనసూయ, కేశవరావులు తమ టూరు ముగించి వచ్చారు. అయినా అనసూయలో పెద్ద మార్పేమీ రాలేదు. నిర్లిప్తంగానే రోజులు వెళ్లదీస్తూంది.

ఒక రోజు ఉదయం బజారునుండి వచ్చిన కేశవరావు అనసూయతో— "అనూ, నీ కీ సంగతి తెలుసా?" అన్నాడు. స్వరంలో ఆత్రత ధ్వనించింది.

"ఏ సంగతి?" పెద్ద ఉత్సాహం చూపలేదు అనసూయ. తనకు తెలుసు భర్త చెప్పబోయే సంగతి. శకుంతలకు చక్కని, పండంటి బిడ్డ కలిగాడని. రాత్రేగా టాక్సీలో వెళ్ళారు శకుంతలా, వాళ్లమ్మగారూ హాస్పిటలుకు? ఇంక వేరే సంగతేముంటుంది గనక!

అనసూయ ఉదాసీనతకు కాస్త చిరాకు కలిగింది కేశవరావుకు.

"మీ స్నేహితురాలికి మగబిడ్డ కలిగాడట. అయితే, పాపం..."

"అయితే..." అనసూయ మనసు శంకించింది.

"తల్లి ఆరోగ్యానికేం ఫరవాలేదు. అయితే పుట్టిన బిడ్డడి కాళ్ళు రెండూ చచ్చుపడిపోయి ఉన్నాయట. అంటే, భవిష్యత్తులోకూడా నడవడానికి పనికి రావట ఆ కాళ్ళు" అన్నాడు నిట్టూర్చుతూ.

అనసూయ నిశ్చేష్టురాలైపోయింది, ఆ మాటలు. తనకు తెలియకనే ఉవ్వెత్తున దుఃఖం పెల్లుబికింది. అంతవరకూ హిమాలయాల్లా పెరిగిపోతున్న అసూయా జ్వాలలు అగ్గి తాకిన రీతి ఈ వార్త విన్న వెంటనే మంచులా కరిగి నీరయిపోయాయి. ఆ స్థానాన్ని అంతు లేని జాలి ఆక్రమించుకొంది. పాపం, శకుంతలకు ఇన్ని రోజుల నిరీక్షణకు ఫలితం అవిటి బిడ్డడా! మరి శకుంతల ఈ ఎదురుదెబ్బకు ఎలా తట్టుకోగలుగుతూందో? ఇప్పుడు తను శకుంతల ముఖం ఎలా చూడగలదు? తనేమనుకొంటుంది? "చూడు, అనసూయా, నీవు ఎంతగా అసూయ చెందావో, నీ మనసుకు తగ్గట్టుగానే భగవంతుడు నా సంతోషాన్ని సర్వనాశనం చేశాడు. ఇప్పుడు నీకు తృప్తిగా ఉంది కదూ?" శకుంతల తన పట్ల ఒకవేళ ఇలా

## స్వాతంత్ర్య గీతి

### జ్యోతిర్మయి

ఉదయారుణ కిరణద్యుతి
 నుజ్జ్వలమై పెనుపొందెడు
త్రివర్ణ కేతన నవ సం
దీప్తి విలసన మ్మదిగో!

భరత స్వాతంత్ర్య కళా
ప్రాభవ వైభవ లక్ష్మి
రజతోత్సవ శుభసమయ
ప్రమోద స్ఫూర్తి యదిగో!

ప్రియదర్శిని మృదులాధర
విలసిత నవదరహాస వి
లాసమ్మున నవచంద్రిక
లాస్యమొనర్చెడు నదిగో!

ఆబాల వృద్ధ జన హృద
యాంబుజములు
 గదలాడుచు
చిందు ఆనంద మరంద
బిందు స్రవంతి యదిగో!

★

ఊహించుకొని ఏవగించుకుంటుందేమోనని తల్లడిల్లిపోయింది అనసూయ.

'లేదు, శకుంతలా, నేను నీ పట్ల ఇంత దారుణంగా ఊహించలేదు. నీ మీద ఒక విధమైన అసూయ జనించిన మాట నిజమే. అయితే ఇంత క్రూరంగా ముమ్మాటికీ ఆలోచించలేదు నా మనసు. ఇప్పుడు ఈ వార్త విన్నప్పుడు కలిగిన రంపపుకోతకంటే, నీకు చక్కని బిడ్డ కలిగాడని విని ఉంటే కలిగే అసూయే ఎంతో హాయిగా ఉండి ఉండేది నాకు. ఇప్పుడు నే ననుభవిస్తున్న మానసిక వేదన భరించరానిదిగా ఉందని నీ కెలా తెలియపరచగలను,శకుంతలా?' లోలోపలే గింజుకుంది అనసూయ.

క్షణక్షణానికీ రంగులు మారిపోతున్న అనసూయ ముఖభావాల్ని గమనిస్తూ, "అనసూయా, సాయంత్రం నేను ఆఫీసు నుండి వస్తూనే హాస్పిటలుకు వెళదాం, రెడీగా ఉండు మరి" అని భార్యను హెచ్చరించి ఆఫీసు కెళ్లిపోయాడు కేశవరావు.

హాస్పిటలు ఆవరణ దాటి ప్రసవం వార్డు చేరారు. శకుంతల ఉండే గదిని సమీపిస్తుంటే అనసూయ గుండె గబగబా కొట్టుకుంది.

అనసూయను చూస్తూనే శకుంతల జీవం లేని నవ్వు నవ్వింది.

"రా, అనసూయా." పక్కనున్న స్టూలు జరిపి కూర్చోమంది.

అనసూయ కొన్ని క్షణాలు మౌనంగా కూర్చుంది. పైకి మామూలుగా ఉన్నప్పటికీ లోలోపలే క్రుంగిపోతూంది. అవనతముఖి అయి కూర్చున్న అనసూయను జాలిగా చూసింది శకుంతల. ఎందుకో అనసూయ చాలా నీరసంగా కనపడుతూంది తన కళ్లకు.

"పాపణ్ణి చూశావా, అనసూయా?" స్వరంలో నిరుత్సాహం ధ్వనించింది.

"ఊహుఁ. . ." మొద్దులా చూసింది శకుంతల వైపు. శకుంతల మెల్లిగా తనే బిడ్డని తీసి అనసూయ చేతిలో ఉంచింది.

పాపడిని అందుకొనేటప్పుడు ఒక విధమైన అనుభూతికి లోనైంది అనసూయ.

"అనసూయా, మా పాపడికి కాళ్లు లేవు." రుద్ధమయింది శకుంతల గొంతు. దుప్పటి తీసి పాపడి కాళ్లు చూపెట్టింది. సన్నగా పుల్లల్లే మెలి తిరిగిన రెండు కాళ్లు వికృతంగా కనపడ్డాయి! అంత వరకూ అణుచుకొన్న దుఃఖం పెల్లుబికింది అనసూయకు! పాపడిని శకుంతల చేతి కందిస్తూ, "నేను పాపిష్ఠురాలను, శకుంతలా" అని శకుంతల చేతులు పట్టుకొని వలవలా ఏడ్చేసింది.

> హాయిగా, సుఖంగా
> జీవించే స్త్రీలకు సంపన్న
> దేశాలకు వలె చరిత్ర
> ఉండదు.
>
> —కర్లిప్

అనసూయ వింత ప్రవర్తనకు విస్మెరపోతూ, "ఇదేమిటి, నువ్వేడుస్తున్నావు. నా దుర్విధికి నే నేడవాలి గాని? దానికి ఎవరేం చేస్తారు? ఇది నా పూర్వ జన్మ ఫలం. అంతే" అని శకుంతల అన్న మాటలు అనసూయకు మరింతగా దుఃఖాన్ని రేపాయి.

"ఊహుఁ. . . అందుక్కాదు. . . నే విన్ని రోజులు నీ పట్ల వ్యవహరించిన దానికి నువ్వేమనుకొంటావో. . ." ఏమో చెప్పాలని ఉంది. తన హృదయంలో కలిగిన మార్పును ఎలా విడమరిచి చెప్పాలో అర్థంకాక ఊరుకుంది.

శకుంతల, అనసూయ చేతులు తన చేతులలోకి తీసుకొని ఆప్యాయంగా నిమురుతూ, "పిచ్చిదానా, నా మనసులో అటువంటిదేం లేదు. మళ్లీ మామూలుగా, మునుపటిలాగా మాట్లాడుకో గలుగుతున్నాం ఇప్పటికైనా. అదే చాలు" అంది. హృదయపూర్వకంగా అంటున్న శకుంతల మాటలతో కొంత సేద దీరింది అనసూయ మనసు. శకుంతల మంచితనం భరించలేకపోయింది. తను కనపరిచిన ఆప్యాయత ముందు భూమిలోనికి అలాగే చొచ్చుకుపోయి ఉంటే బాగుండునేమో అనిపించింది అనసూయకు ఆ క్షణాన.

• • •

ఇంటికి వచ్చిన అనసూయ కళ్ల ముందు ఆ పాపడే మెదులుతున్నాడు. శాశ్వతంగా అవిటి అయిన ఆ పాపడి భవిష్యత్తు?...ఏదో మనసంతా దిగులుతో నిండిపోయింది, హాస్పిటలునుంచి వచ్చిన తరవాత. ఈ ఆలోచనలతోనేమో తల తిరుగుతున్నట్లుగా, ఏదో మైకంగాఉంది- అంతే. అలానే పడిపోయింది నించున్న పాటున. 'దబ్బున' పడ్డ శబ్దం వినిపించి కేశవరావు హడావిడిగా పరుగెత్తుకొచ్చాడు. వంటింటి గుమ్మం ముందు అనసూయ స్పృహ తెలియని స్థితిలో పడి ఉంది.

"అనూ ... అనూ..." కంగారుగా పిలిచాడు, పలకలేదు. అనసూయను మెల్లగా లేవనెత్తి మంచంమీద పడుకోబెట్టి, పక్కింటి మామ్మగారిని కాస్త కనిపెట్టి ఉండమని తను వెళ్లి డాక్టరును పిలుచుకు వచ్చాడు.

డాక్టరు అనసూయను పరీక్షించి మెల్లిగా మందహాసం చేశాడు. "భయమేం లేదు. స్త్రీలకు మామూలుగా వచ్చే జబ్బు అంతే. ఆవిడ గర్భిణి. మరీ నీరసంవల్ల ఇలా అయింది. మీరు వెంటనే ఒక లేడీడాక్టరుకు చూపటం మంచిది" అంటూ అప్పటికేదో ఇంజక్షన్ ఇచ్చి వెళ్లాడు డాక్టరు. కేశవరావుకు కొంతసేపు మాట రాలేదు, ఆనందంతో. తన ఊహ వృథా పోలేదు. పుణ్యనదీ స్నానాలు, పుణ్యస్థలాలు దర్శించిన ఫలితం ఇది. ఈ విషయం అనసూయ వింటే ఇంకెంత సంతోషిస్తుందో! ఆత్రంగా అనసూయ మొహం వంకే చూస్తూ కూర్చున్నాడు. డాక్టరు వెళ్లిన రెండు నిమిషాలకు అనసూయ కళ్లు తెరిచింది. మెల్లగా అసలు సంగతి అనసూయ చెవిని వేశాడు. అనసూయ కళ్లు మిలమిల లాడాయి. అప్పటికే వేయి ఏనుగుల బలం వచ్చినట్లయింది. వెంటనే లేచి కూర్చుంది. "మీరు అన్నది నిజమా?" భర్తను మరోమారు అడిగింది సందేహం తీరక. తనూ తల్లి కాబోతూంది. ఇక అమ్మలక్కల విమర్శలు తన్నేం చేయలేవు. తనూ సంఘంలో ధైర్యంగా తలఎత్తుకు తిరగవచ్చు. 'గొడ్రాలు' అని దూరిన సంఘమే తనను సానుభూతితో చూస్తుంది ఇక. ఏమిటో, ఇన్ని రోజులు బరువుగా ఉన్న హృదయం ఈ వార్తతో అతి తేలికఅయి గాలిలో తేలిపోతూన్నట్లుంది తనకు.

లేడీ డాక్టరు సలహా విన్న తరవాత కేశవరావు కాస్త ఖిన్నుడయ్యాడు. గుండె మరీ బలహీనంగా ఉన్నందువల్ల ఎక్కువ ఆలోచనలు లేకుండా ఉండాలని సలహా ఇచ్చింది ఆమె.

సంగతి విన్న శకుంతల నెలైనా నిండని పాపడిని తీసుకొని అనసూయను చూడటానికి వచ్చింది సంతోషంతో.

శకుంతలను నిండు మనసుతో ఆహ్వానించి కూర్చోపెట్టింది అనసూయ. పాపడిని అందుకొంటూంటే గుండె కలుక్కుమంది అనసూయకు. అనసూయ ఆరోగ్యం విషయమై ఆత్రత కనపరిచింది శకుంతల. ఎన్నో జాగ్రత్తలు చెప్పి వెళ్లింది.

నెలలు నిండుతూంటే మరీ నీరసించిపోయింది అనసూయ. రాత్రులు పడుకొంటే ఏవేవో యోచనలు. శకుంతల పాపడు వికృతమైన కాళ్లతో తన ముందు, అంతకంటే వికృతమైన నవ్వుతో కనపడుతున్నట్లు తోచి గట్టిగా కళ్లు మూసుకొనేది. ఒడలంతా ముచ్చెమటలు పోసేది.

నొప్పులు ప్రారంభమైన వెంటనే హాస్పిటలులో జాయిన్ చేశారు. నొప్పులు ఎక్కువయ్యాయి. అనసూయ కలవరింతలూ ఎక్కువయ్యాయి. "నాకు పాప వద్దు! . . నాకు పాప వద్దు!" పిచ్చిగా అరవసాగింది. బయట నించుని వింటున్న కేశవరావు గుండె దడదడలాడింది. ఇదేమిటీ, అనసూయ ఇలా కలవరిస్తోంది! ఏమీ తోచలేదు. పక్కనే బెంచీమీద శకుంతల కూర్చొని ఉంది. తనకూ అనసూయ అలా అరవటం వింతగా తోచింది. ఏమైనా గండం గడిచి బయట పడితే చాలు—అని భగవంతుణ్ణి ప్రార్థించింది.

బిడ్డ 'కేరు' మన్న శబ్దం విని గది ద్వారం వద్దకు పరుగెత్తుకెళ్లింది శకుంతల. కేశవరావు ఆత్రంగా మూయబడి ఉన్న ద్వారం కేసే చూస్తున్నాడు. గది తలుపు తెరవబడింది. బయటికొచ్చిన లేడీ డాక్టరు ముఖం వివర్ణంగా ఉంది.

ఆత్రంగా సమీపించిన కేశవరావుతో — "సారీ, మరీ బలహీనంగా ఉన్నందువల్ల తల్లి ప్రాణాలు కాపాడలేకపోయాం" అంటూ కొన్ని ధైర్యవచనాలు పలికి నిష్క్రమిస్తున్న డాక్టరు వంక వెర్రిగా చూసి గదికేసి పరుగెత్తుకెళ్లారు శకుంతల, కేశవరావు—ఇద్దరూ.

మంచం పక్కన తొట్టెలో గుమ్మడి పండులాంటి అబ్బాయి! ఆ పాపడిని చూడనోచుకోని తల్లి విగతజీవి అయి పక్కన!

"అనసూయా. . . నీకు చక్కని, పండంటి బిడ్డ కలిగాడు, అనసూయా . . . కళ్లు తెరు, అనసూయా. . ." పిచ్చిగా రోదించింది శకుంతల. కేశవరావు మొద్దుబారిన చూపులతో రోదిస్తున్న శకుంతల వంక, ఏడుస్తున్న పాపడి వంక, ఈ లోకంతో నిమిత్తం లేని అనసూయ వంక అలానే చూస్తూ నించుండిపోయాడు! ★